సాక్షి జగిత్యాల

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



శ్రావణ పూజలు

ధర్మపురి: ఆలయాల్లో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పూజలు చేశారు. అంతకుముందు గోదావరిలో స్నానాలు చేశారు.



పసుపు బోర్డుపై ఆశలు

జగిత్యాలఅగ్రికల్చర్: నిజామాబాద్‌లో పసుపు బోర్డు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

కాటేస్తున్న దోమలు

• బల్దియాల్లో నీటినిల్వలు • మట్టిరోడ్లపైనా గుంతలు • వృద్ధిచెందుతున్న లార్వాలు • ఖాళీ స్థలాల్లో పాగా • రాత్రివేళ జనాలపై దండయాత్ర

మెట్‌పల్లి/రాయికల్: దోమలు పట్టణవాసులను కాటేసి రక్తం పీల్చుతున్నాయి. వాటిదెబ్బకు తీవ్ర అస్వస్థతకు గురవుతున్న ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. కొద్దిరోజుల పాటు కురిసిన మోస్తరు వర్షాలతో జనావాసాలు, డ్రైనేజీలు, ఖాళీ స్థలాలు, రోడ్లపై గుంతల్లో పెద్దఎత్తున వర్షపునీరు నిలిచిపోయింది. ఇందులో దోమలు గుడ్లు పెట్టి తమ సంతానం వృద్ధి చేసుకుని జనాలపై దండయాత్ర చేస్తున్నాయి. నియంత్రణ చర్యలు తీసుకోవాల్సిన బల్దియా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు ఎదుర్కొంటోంది.

సాక్షి ఫోకస్



మెట్‌పల్లి : జనావాసాల్లో నిలిచిన వర్షపునీరు

ఖాళీ స్థలాలే సమస్య

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో దోమలు విజృంభిస్తున్నాయి. వీటి బెడదతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. దోమల నియంత్రణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడి మూల్యం చెల్లిస్తున్నారు.

మురుగునీటి గుంతలు..

- కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇళ్లమధ్య ఉన్న ఖాళీ స్థలాలు, మట్టి రోడ్లపై గుంతల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది.
- నీటి నిల్వల్లో దోమలు గుడ్లు పెడుతున్నాయి. క్రమంగా వృద్ధి చెందుతున్నాయి.
- వర్షాకాలంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతోపాటు ప్రత్యేకంగా ఆయిల్ బాల్స్ వేస్తున్నారు.
- అయినా, దోమలు, ఈగలు నియంత్రణలోకి రావడంలేదు.

భరించలేకపోతున్నం



మా కాలనీలో ఎటుచూసినా ఖాళీ స్థలాలు, రోడ్లపై వర్షపునీరు కనిపిస్తున్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువైంది. పొద్దంతా, రాత్రంతా మాపై దాడిచేస్తున్నాయి. అధికారులు దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

– తోట ప్రవీణ్, బాలకృష్ణనగర్, మెట్‌పల్లి

దృష్టి సారించాం



దోమల నియంత్రణపై దృష్టి సారించాం. వార్డుల్లో ప్రతీరోజు ఫాగింగ్ చేస్తున్నాం. నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేస్తున్నాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

స్వైరవిహారం చేస్తున్నాయి..



భీమునిదుబ్బలో నిలిచిన నీరు

కోరుట్ల: నెల క్రితం కురిసిన వర్షాలతో శివారులోని కల్లూర్‌రోడ్డు, భీమునిదుబ్బ, ప్రకాశంరోడ్డు, బిలాల్‌పురా, రాంనగర్, ముత్యాలవాడ, అంబేడ్కర్‌నగర్‌లో ఎక్కడిక్కడే వర్షపునీరు నిలిచింది. దోమలు వృద్ధి చెందాయి. నాలుగు రోజులుగా మళ్లీ వానలు కురుస్తుండంతో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం ఇళ్లల్లో చేరి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. జనాలు మలేరియా, వైరల్‌ఫీవర్ బారినపడుతున్నారు. మరోవైపు.. నీటి నిల్వలపై బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, ఆయిల్ బాల్స్ వేస్తూ దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ శానిటేషన్ అధికారులు చెబుతున్నారు.

దోమలు పెరిగాయి



వానలకు దోమలు బాగా పెరిగినయ్.. ఇండ్లల్లో పట్టపగలే తిరుగుతున్నయ్. ఫ్యాన్లు వేసినా పోత లేవ్. నివారణ మందులు వాడుతున్నా ఫలితం లేదు. జ్వరాలు వస్తున్నయి. మున్సిపాల్టీ వారు తగిన చర్యలు తీసుకోవాలె.

– శ్రీనివాస్, ముత్యాలవాడ, కోరుట్ల

ఈగలు.. దోమలకు ఆవాసాలు



గిరుకలకాలనీలో నీటి నిల్వలు

ధర్మపురి: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని ఇళ్ల, పరిసరాల్లో నీరు నిలిచి ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. మున్సిపల్‌లోని 15 వార్డుల్లో సుమారు 20 వేలకుపైగా జనాభా ఉంది. ఎక్కడ చూసినా నీటి నిల్వలే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ వృద్ధి చెందుతున్న దోమల నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సమాచారం	
వార్డులు	జానాభా
15	20వేలు

జ్వరాలు వస్తున్నయి



ఇండ్ల పక్కన నిలిచిన నీటితో ఈగలు, దోమలు చేరి జ్వరాల బారిన పడుతున్నాము. మాది గిరుకల కాలనీ. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వర్షపు నీటితో చెరువులా తయారౌతుంది. నిల్వ నీటితో దుర్గంధం వెదజల్లుతుంది.

– రాధ, ఐదోవార్డు, ధర్మపురి

ఆయిల్ బాల్స్ వేస్తున్నాం..



నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా వార్డుల వారీగా రోజూ రసాయనాలు స్ప్రే చేయిస్తున్నాం. ఆయిల్ కూడా బాల్స్ వేస్తున్నాం. వీటి ద్వారా దోమలు వృద్ధి చెందవు. పారిశుధ్య లోపం తలెత్తకుండా పట్టణంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

– రమేశ్, మున్సిపల్ కమిషనర్

చర్యలు తీసుకోండి

జగిత్యాలజోన్: వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సూచించారు. జెడ్పీ కార్యాలయంలో శుక్రవారం వైద్యాధికారులతో వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. వర్షాలతో గ్రామాలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలు వి జృంభించాయని, తద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రమబలే ప్రమాదం ఉందన్నారు. వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రోడ్లపై నీటి నిల్వలు తొలగించాలని సూచించారు. సీఈవో నరేశ్, డీపీవో దేవరాజ్, డీఎంహెచ్‌వో శ్రీధర్, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ ఆఫీసర్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

నీటి నిల్వలే కారణం



నిల్వనీటిపై దోమల దండు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వాణినగర్, వినాయకనగర్ తదితర కాలనీల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున నిలుస్తోంది. నీటినిల్వలపై దోమలు వృద్ధి చెంది జనాలపై దాడులు చేస్తున్నాయి. ఫలితంగా ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. మున్సిపల్ అధికారులు దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నా.. ఫలితం లేకుండాపోతోంది. జనావాసాల్లోని ఖాళీ ప్రదేశాలు దోమలకు ఆవాసాలుగా మారాయి. తగిన చర్యలు తీసుకోవాలి.

జగిత్యాల బల్దియా సమాచారం	
వార్డులు 48	నివాసాలు 25,000
జనాభా	1,30,000



జగిత్యాల వినాయకనగర్‌లో జనావాసాల మధ్య నిలిచిన వర్షపునీరు

ఫాగింగ్ చేయాలి



వర్షాకాలంతో పెరుగుతున్న దోమల ఉధృతి తగ్గించేందుకు అధికారులు ఫాగింగ్ చేయాలి. ఖాళీ ప్లాట్లు, నీటినిల్వలున్న ప్రాంతాలను గుర్తించాలి. నీటి నిల్వలు తొలగించాలి. ఇంటింటా దోమల మందు స్ప్రే చేయాలి.

– వంశీ, వినాయకనగర్, జగిత్యాల

ప్రత్యేక బృందాల ఏర్పాటు



పట్టణంలో నీటినిల్వలు తొలగించడం, దోమల నియంత్రణ మందు స్ప్రే, ఫాగింగ్ కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశాం, నీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. దోమల కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. – అనిల్‌బాబు, బల్దియా కమిషనర్, జగిత్యాల

మురుగునీటి గుంతలు



మాదిగకుంటలో నీటి నిల్వలు

రాయికల్(జగిత్యాల): ఇందిరానగర్, శివాజీనగర్, మాదిగకుంట ఏరియాలో అధికంగా మురుగునీటి గుంతలున్నాయి. అందులో వర్షపునీరు నిల్వకావడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇవి దాడిచేయడంతో ప్రజలు మలేరియా, వైరల్ ఫీవర్ బారినపడుతున్నారు.

అధికారులు స్పందించాలె



పట్టణ నడిబొడ్డున ఉన్న మాదిగకుంటలో వర్షపునీరు ఎక్కువగా నిల్వ అవుతంది. దోమలు పెరుగుతున్నయి. మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. అధికారులు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలె.

– రాజ్‌కమల్, స్థానికుడు, రాయికల్

చర్యలు తీసుకుంటున్నాం



మున్సిపల్ పరిధిలో దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా నీటినిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాం. పట్టణవాసులకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

న్యూస్‌రీల్

ఘనంగా ఉట్ల పండుగ



పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు సేవ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం ఉట్ల పండుగ ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఇసుక స్తంభం భోగమండపంలో స్వావారిని ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈవో శ్రీనివాస్, రేనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, వేదపండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ, అర్చకుడు నంబి శ్రీనివాసచార్యులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం



పోచమ్మతల్లి రథం ప్రారంభిస్తున్న శ్రీనివాస్

జగిత్యాలటౌన్: పురాణిపేట పోచమ్మతల్లి ప్రచార రథాన్ని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే లోకమాత పోచమ్మ తల్లి ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. ఈనెల 11న ఉత్సవాలు ప్రారంభిస్తారమని ఆలయ కమిటీ ప్రతినిధి గాజులు రాజేందర్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ కూతురు రాజేశ్, అలయ కమిటీ నిర్వాహకులు గాజోజు రాజగోపాలచారి, రాఘవచారి, హరి వద్లూరి, కొయ్యడ సత్యనారాయణ, పూజారి అంగడిమఠం చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా లోక్ అదాలత్

జగిత్యాలక్రైం: జిల్లాలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తారని ఎస్పీ భాస్కర్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులో క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగదాలు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు రాజీ కుదుర్చునే వీలుందన్నారు. వైవాహిక జీవితం, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, పెటీ కేసులు రాజీ కుదుర్చుతారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యత్యాసం సవరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయ బదిలీల్లో పొరపాట్లను సరిచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ కోరార. ఈమేరకు శుక్రవారం డీఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కొత్తగా యూడైస్ నంబరు కేటాయించిన ప్రాథమిక పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేడర్ పోస్టులను కేటాయించాలన్నారు. బదిలీలు, పదోన్నతులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బడ్జెట్ విడుదల చేయండి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జగిత్యాల: పెంచిన వేతనాల చెల్లింపు బడ్జెట్ విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కోరారు. ఈమేరకు డీఈవో కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, పెరిగిన వేతనాన్ని వెంటనే ఎరియర్స్‌తో కలిపి చెల్లించాలన్నారు. మెస్ చార్జీలు సవరించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. సీఐటీయూ కన్వీనర్ ఇందూరు సులోచన పాల్గొన్నారు.

అమ్మవారికి కలశాభిషేకం



కలశాలతో తరలి వస్తున్న భక్తులు

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని లలితాంబిక శక్తిపీఠం దేవాలయంలో శుక్రవారం 108 అమృత కలశ జలాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెలించారు.

కొత్త రైతులకు బీమా చిక్కులు!

- నూతన రైతు కుటుంబాలకు బీమాలో జాప్యం
- వీరందరి పేరిట బీమా సంస్థకు ప్రీమియం కట్టిన ప్రభుత్వం
- అయినా కొత్త రైతుల పేరిట జనరేట్ కాని ఇన్సూరెన్స్ ఐడీలు
- మరణించిన కొత్త రైతుకుటుంబాలకు బీమా చెల్లింపులో ఆలస్యం
- త్వరలో సమస్య పరిష్కారిస్తామంటున్న వ్యవసాయాధికారులు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లా కొత్త రైతు కుటుంబాలకు రైతుబీమాలో కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవల తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా విరాసత్ విధానంలో భూములు పొందిన వారికి, కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి రైతులుగా మారిన వారి కుటుంబాలను ఇన్సూరెన్స్ కష్టాలు వెంటాడుతున్నాయి. వాస్తవానికి రైతు అకాల మరణం చెందితే.. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు కేవలం రెండు వారాల్లో అంటే దాదాపు 14 రోజుల్లో రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం అందజేస్తుంది. ఇందుకు సంబంధించి ప్రీమియం బీమా సంస్థకు ఏటా ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ, 2022 ద్వితీయార్థంలో కొత్తగా భూములకు యజమానులుగా మారిన వారికి తాజాగా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వాస్తవానికి వీరందరినీ ప్రభుత్వం ఏనాడో యజమానులుగా గుర్తించింది. రైతు పే రిట పట్టాదారు పాసు పుస్తకం జారీ చేసి, ధరణిలో పేరు కూడా నమోదు చేసింది. కానీ, వీరికి ఇంతవరకూ ఇన్సూరెన్స్ ఐడీలు జనరేట్ కాకపోవడం గమనార్హం.

ఏంటీ సమస్య?

కొత్తగా వ్యవసాయ భూములకు యజమానులుగా మారిన రైతుల పేరిట ప్రభుత్వం బీమా సంస్థకు ఏటా ప్రీమియం చెల్లిస్తుంది. గతంలో బీమా సంస్థకు ప్రీమియం వివరాలు, రైతులకు సంబంధించి ఐడీని కాగితం రూపంలో రైతులకు అందజేసేవారు. ఏటా అదే ఐడీని రెన్యూవల్ చేసేవారు. రెండేళ్లుగా ఈ విధానం ఆన్‌లైన్ అయిపోయింది. దీంతో రైతుల ఇన్సూరెన్స్ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు అవుతున్నాయి. రైతుకు అతడి పేరిట జనరేట్ అయిన ఐడీ నంబరు మాత్రం చెబుతున్నారు. ఒకవేళ ఆ రైతు ఆకస్మిక మరణం చెందితే.. సదరు ఐడీ ద్వారానే అతడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము వస్తుంది. తాజాగా ప్రభుత్వం రైతు పేరిట బీమా ప్రీమియం చెల్లించినా.. వారికి ఐడీలు జనరేట్ కావడం లేదు. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని సమాచారం. ఇలాంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నాయి. బీమా సంస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో రైతులకు ఇంకా ఐడీలు జనరేట్ కాలేదని సమాచారం.



గోనె కొమురయ్య(ఫైల్)

కల్వచర్లలో ఇలా..

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లలో కొత్తగా భూమికి యజమానిగా మారిన గోనె కొమురయ్య అనే రైతు పేరిట కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం ధరణిలో పేరునమోదు అయ్యింది. అనుకోకుండా కొమురయ్య ఆగస్టు 19న మరణించాడు. నిబంధనల ప్రకారం అతడి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును రెండు వారాల్లోగా అందజేయాలి. కానీ, మూడు వారాలు గడుస్తున్నా ఇంతవరకూ చెక్కు అందలేదని మృతుడి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఇదేంటని ఆరా తీసిన గ్రామపెద్దలు.. అసలు కొమురయ్య పేరిట బీమా ఐడీ ఇంకా జనరేట్ కాలేదని తెలుసుకుని అవాక్కయ్యారు. కేవలం కొమురయ్యే కాదు.. కొత్త రైతులందరికీ ఇదే పరిస్థితి ఉందని తెలిసి ఆందోళన చెందుతన్నారు. అయితే, వ్యవసాయాధికారులు మాత్రం కంగారుపడాల్సింది ఏమీలేదని, కాస్త జాప్యమైనా బీమా సొమ్ము వస్తుందని భరోసా ఇస్తున్నారు.

పదుల కుటుంబాల ఎదురుచూపు..

కొత్తరైతులుగా నమోదై ఏడాదిలోగా మరణించిన రైతుల సంఖ్య కొత్త జిల్లాల వారీగా పదుల సంఖ్యలో పెండింగ్‌లో ఉందని సమాచారం. సిరిసిల్లలో ఐదుగురు, పెద్దపల్లిలో 32 మంది, కరీంనగర్‌లో సుమారు 10 కుటుంబాలు జగిత్యాలలో ఐదు కుటుంబాలు ఇలా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అదే సమయంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు త్వరలోనే వీరికి పరిహారం అందజేస్తామని స్పష్టంచేస్తున్నారు.

భవన నిర్మాణాల్లో వేగం పెంచండి

• అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల: గ్రామపంచాయతీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దివాకర ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పనుల పురోగతిపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లాకు 173 గ్రామపంచాయతీ భవనాలు మంజూరు కాగా ఇప్పటివరకు 124 భవనాలు గ్రౌండ్ అయ్యాయని, మిగిలి వాటి పనులు వారంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. గొల్లపల్లి, వెల్గటూర్‌లో పనులు మందకొడిగా జరుగుతున్నాయని, వందశాతం పురోగతి కన్పించాలని, లేకుంటే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని 36 గ్రంథాలయాలు(రీడింగ్ రూమ్స్)కు సంబంధించిన పనులను జిల్లా గ్రంథాల సంస్థతో సమన్వయం చేసుకుని పూర్తిచేయాలని సూచించారు. అధిక వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు వ్యాధులకు గురికాకుండా శానిటేషన్‌పై దృష్టి సారించాలని, డ్రైనేజీ, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాలని చెప్పారు. స్వీప్ కార్యక్రమంపై ఓటర్ నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ రెహమాన్, డీపీవో దేవరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ దివాకర

నమ్మకం పోయింది.. న్యాయం చేయండి

- 'దళితబంధు' లబ్ధిదారుల ఆవేదన
- తహసీల్దార్ కార్యాలయంలో వినిపత్రం అందజేత

మేడిపెల్లి(వేములవాడ): దేశాయిపేటలో స్థాపిస్తున్న స్పైస్ యూనిట్ పూర్తవుతుందని నమ్మకం తమకు లేదని దళితబంధు లబ్ధిదారులు ఎడ్ల రమేశ్, ముత్తునూరి గంగాధర్, దాసరి స్వప్న, నెల్లుట్ల గంగు, ఉమ్మడి రాకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్పైస్ యూనిట్ ద్వారా వ్యాపారం చేసే పద్ధతులు తమకు తెలియదని, దీనిని దృష్టిలో పెట్టుకుని తమ సొమ్ము తమకు ఇప్పించి న్యాయం చేయాలని వారు కోరారు. కాగా, దళితబంధు పేరిట మోసపోయిన వారికి తమ పార్టీ మద్దతుగా నిలుస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. కేవలం ప్రతిపక్ష పార్టీ నాయకులు దళితులను రెచ్చగొట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పేర్కొనడం సరికాదన్నారు. ఈమేరకు ఆయన బాధితులను కలిసి సంఘీభావం ప్రకటించారు. కాగా, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉరుమడ్ల లక్ష్మణ్, మాట్లాడుతూ, దేశాయిపేట స్పైస్ యూనిట్‌లో జరిగిన అవకతవకలను త్వరలోనే వెలికితీస్తామన్నారు. వారంరోజుల్లో బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, మాలోతు లచ్చానాయక్, బొమ్మెన ప్రశాంత్, కల్లెడ వినయ్, ముంజ కిషన్, హరీశ్, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దళితులు

క్లుప్తంగా

కారు డ్రైవర్‌కు దేహశుద్ధి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద శ్రీనివాస్ థియేటర్ సమీపంలో మద్యం మత్తులో ఇద్దరిని ఢీకొట్టిన కారు డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టణానికి చెందిన కారు డ్రైవర్ శుక్రవారం రాత్రి అతిగా మద్యం తాగి పాతబస్టాండ్ ప్రాంతంలో ఓ వ్యక్తిని ఢీకొట్టి పారిపోయాడు. అదేవ్యక్తి శ్రీనివాస్ థియేటర్ సమీపంలో మరోవ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో పాత బస్టాండ్ సమీపంలో గాయాలైన వ్యక్తి బంధువులు కారుడ్రైవర్‌ను వెంబడించి శ్రీనివాస్ థియేటర్ సమీపంలో పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం


విద్యాసాగర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భీష్మనగర్‌కు చెందిన కొండ్ర విద్యాసాగర్(45) అనే మత్స్యకారుడు ఈనెల 3న జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామంలోని గచ్చుమాట్ వాగులో వరద ప్రవాహంలో గల్లంతయ్యాడు. అతడి మృతదేహం శుక్రవారం హైదర్‌పల్లి గ్రామ శివారులోని వంతెన వద్ద లభ్యమైంది. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి, అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతుడి అల్లుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

యువతి ఆత్మహత్య


రమ్య(ఫైల్)

రాయికల్(జగిత్యాల): మంక్యానాయక్ తండాకు చెందిన మాలోతు రమ్య (22) జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అజయ్ శుక్రవారం తెలిపారు. రమ్య కొద్దిరోజులుగా ఒంటరిగా ఉంటోంది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మైనార్టీ గురుకులంలో కొట్లాట

కోరుట్ల: పట్టణంలోని మైనార్టీ గురుకులంలో శుక్రవారం విద్యార్థుల నడుమ కొట్లాట జరిగిందని, ఈ సంఘటనలో ఓ విద్యార్థి గాయపడినట్లు తెలిసింది. గురుకులంలో చదివే ఆరో తరగతి విద్యార్థిని ఏడోతరగతి చదివే ముగ్గురు విద్యార్థులు కొట్టారని, దీంతో ఆ విద్యార్థి భుజాలపై కమిలినట్లు సమాచారం. సమాచారం అందుకున్న బాధితుడి తండ్రి రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన


ర్యాలీలో అధికారులు, సిబ్బంది

రాయికల్(జగిత్యాల): ఇటిక్యాల గ్రామంలో ఓటరు నమోదు కార్యక్రమంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో దేవరాజ్ మాట్లాడుతూ, 18 సంవత్సరాల వయసు నిండిన యువతీయువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ రాధ, ఎంపీవో సుష్మ పాల్గొన్నారు.

పసుపు బోర్డుపై ఆశలు!

జగిత్యాలఅగ్రికల్చర్: పసుపును ఆహార పదార్థాల్లోనే కాకుండా చర్మ సౌందర్య సాధనాలు, రంగుల పరిశ్రమలు, పరిమళ ద్రవ్యాల తయారీలో వినియోగిస్తున్నారు. దీంతో దీనికి అంతర్జాతీయంగా మంచిడిమాండ్ ఉండేది. ఒకప్పుడు బంగారంతో పోటీ పడింది కూడా. కానీ, ఇప్పుడు చతికిల పడిపోయింది. పెట్టుబడి కూడా రావడం లేదు. అయితే, రైతుల ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వం తాజాగా స్పందించింది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని, దానిని త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని ప్రకటించడంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

- పడిపోతున్న పంట ధరలు
- కేంద్రప్రభుత్వ ప్రకటనపై ఊరట
- ఆచరణలోకి తేవాలని డిమాండ్



అభినందనీయం



పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయం. దీనికోసం రైతులు ఉద్యమించి అనేకసార్లు జైలుకు వెళ్లారు. పసుపు బోర్డు ఏర్పాటుతో మద్దతు ధర లభిస్తే రైతులు సంతోషిస్తారు.
– తిరుపతిరెడ్డి, పసుపు రైతుల ఉద్యమ నాయకుడు, జగిత్యాల

ప్రారంభించాలి



జిల్లాలో ప్రధాన పంట పసుపు. కొన్నేళ్లుగా సాగు పెట్టుబడి కూడా రావడం లేదు. రైతులను ఆదుకోవాలని పోరాటాలు చేస్తూనే ఉన్నాం. ప్రభుత్వం ప్రకటించిన పసుపు బోర్డును ఆచరణలోకి తేవాలి. త్వరగా ప్రారంభించాలి.
– నారాయణరెడ్డి, పసుపు రైతుల ఉద్యమ నాయకుడు, మెట్‌పల్లి

రైతుల పోరాటాలు..

- పసుపు బోర్డు మొన్నటిదాకా రాజకీయ అస్త్రంగానే మారింది.
- జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తున్నారు.
- ప్రధానంగా మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లో అత్యధికంగా సాగవుతోంది.
- పసుపు బోర్డు ఏర్పాటుకోసం రైతులు అనేక ఉద్యమాలు చేశారు.
- అయినా, కేంద్రప్రభుత్వం స్పందించలేదు.
- చివరకు గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి దాదాపు 300 మంది పసుపు రైతులు వరకు పోటీచేశారు.
- అందులో జగిత్యాల జిల్లాకు చెందిన రైతులు 170మంది వరకు ఉండటం విశేషం.
- దీంతో, పసుపు రైతుల సమస్య ఒక్కసారిగా దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చింది.
- రైతుల ఆందోళనతో పసుపు బోర్డుకు బదులు నిజామాబాద్‌లో సుగంధ ద్రవ్యాల రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.
- దీనిద్వారా రైతులకు ఒరిగింది ఏమి లేదనే అభిప్రాయాలు వచ్చాయి.
- బోర్డును ఏర్పాటు చేయాల్సిందేనని ఓ వైపు రైతులు, మరో వైపు ప్రతిపక్షాలు పట్టుబడుతూనే ఉన్నాయి.
- కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని నిజామబాద్ ఎంపీ అర్వింద్ రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చారు.
- దానిపై ప్రతిపక్షాలు కొంతకాలంగా ఆయనను నిలదీస్తూ వస్తున్నాయి.
- ఇప్పటివరకు పసుపు బోర్డు ఏర్పాటు చేయడం వీలు కాదంటూ చెప్పిన కేంద్రప్రభుత్వం.. తాజాగా, నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

రైతులకు ఏం లాభమంటే..

పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు ఉత్పత్తులను నేరుగా ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. దీనిద్వారా గిట్టుబాటు ధర లభిస్తుంది. ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి పలు ఉప ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా అధిక ధర పలికే అవకాశం ఉంటుంది. మార్కెట్‌లో ధర లేనప్పుడు బోర్డు నేరుగా కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. పంట నిల్వకు కోల్డ్ స్టోరేజీలు కూడా ఏర్పాటు చేయవచ్చు. పంటపై శాస్త్రవేత్తలు రకరకాల పరిశోధనలు చేసి దిగుబడులను పెంచడమే కాకుండా తెగుళ్లు, పురుగులను తట్టుకునే నూతన వంగడాలు రూపొందించే అవకాశం ఉంది. నేలలో భూసార పరీక్షలు చేసేందుకు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారు. ఆధునిక యంత్రాలు, శాస్త్ర, సాంకేతికత రైతులకు పరిచయం చేసే అవకాశం ఉంటుంది. విత్తనంతోపాటు ఆధునిక యంత్రాలను రాయితీపై అందిస్తారు. సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం అత్యధికంగా నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుంది. తద్వారా రైతుల ఆదాయం పెరుగుతుంది.

పెరుగుతున్న పెట్టుబడి..

- పసుపు సుమారు ఏడాది పంట. దాదాపు 9 నుంచి 10 నెలల పాటు నేలలో ఉంటుంది.
- అన్ని ఖర్చులు కలిపితే ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుంది.
- ఎకరాకి లారీ కోడిఎరువు పాటుగా వేస్తున్నారు.
- దానిధర రూ.25 వేల వరకు చేరింది.
- పసుపు తవ్వె కూలీల ఖర్చు రోజూ రూ.700 వరకు పలుకుతోంది.
- ఇలా ఎకరం పసుపు తవ్వేందుకు కనీసం రూ.25 వేల వరకు ఖర్చు వస్తుంది.
- ఉడుకబెట్టి, ఆరబెట్టి, మార్కెట్‌కు తరలించేందుకు మరో రూ.10 వేలు వెచ్చిస్తున్నారు.
- వీటితోపాటు రసాయన ఎరువులు, విత్తనం, ట్రాక్టర్‌తో దున్నేందుకు, కలుపు ఇలా.. మరో రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇంతా చేసినా మార్కెట్‌లో విక్రయిస్తే ఎకరాకు కనీసం రూ.లక్ష కూడా రావడం లేదు.
- దీనికితోడు వాతావరణ మార్పులతో పంటకు వ్యాధులు సోకి దిగుబడి సగానికి సగం పడిపోతోంది.

మహిళలు స్వయం కృషితో ఎదగాలి

- అదనపు కలెక్టర్ లత



జగిత్యాల: మహిళలు స్వయం కృషితో ఎదగాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. స్థానిక సుమంగళి గార్డెన్స్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం నిర్వహించిన మెగా రుణమేళాలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. మహిళా సంఘాల సభ్యులు అర్హత మేరకు రుణాలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. రుణవాయిదాల చెల్లింపులు కూడా 99 శాతం ఉన్నాయని తెలిపారు. భవిష్యత్‌లో వీటిని వందశాతానికి పెంచాలని అన్నారు. మెగా రుణ మేళాలో 6 బ్రాంచ్‌లకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 205 స్వశక్తి సంఘాలకు రూ.21 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ పొన్న వెంకట్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ సరశ్‌గుప్తా, మెప్మా ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న బందోబస్తు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి వద్ద గత బుధవారం చేపట్టిన పోలీసు బందోబస్తు శుక్రవారం కూడా కొనసాగింది. సీపీఎం నాయకులు పేదలతో అందులో గుడిసెలు వేయించే ప్రయత్నం చేస్తున్నారు. ఈక్రమంలో ఆ గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఆ స్థలంలోకి ఎవరూ రాకుండా పోలీసులు మూడు రోజులుగా బందోబస్తు కొనసాగిస్తున్నారు. సీపీఎం నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద స్టేడియంలో సమావేశమవుతున్నారనే సమాచారంతో ప్రభుత్వ భూమి వద్ద మరిన్ని పోలీసు బలగాలను పెంచారు. రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకవైపు పేదలు, మరోవైపు గ్రామస్తులు, వారిని అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగడంతో తిమ్మాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

కోరుట్ల నడిబొడ్డున పేకాట

కోరుట్ల: పట్టణ నడిబొడ్డున బస్టాండ్ – అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా ఓ కిరాణం పైఅంతస్తులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి రూ.89,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్ శుక్రవారం తెలిపారు. కొంత కాలంగా ఇక్కడ పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫిజియోథెరపీతో ప్రయోజనాలు

- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వొల్లాల అశోక్

జగిత్యాల: ప్రస్తుతం మనుషులకు ఫిజియోథెరపీ ఎంతోముఖ్యమని ఫిజియోథరపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వొల్లాల అశోక్ అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత జీవన విధానంలో అనేకమంది అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫిజియోథెరపీ చేయడం ద్వారా బాధితులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ ఆర్థోపెడిక్ వేణుగోపాల్, ఫిజియోథెరపీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంగాధర్, ప్రతినిధులు శివకుమార్, అనిల్‌కుమార్, బోగ ప్రవీణ్, ఇందూరి, అనిల్‌కుమార్, అజీమ్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సభ్యులు

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ..

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని ఆస్పత్రిలో శ్రీ లక్ష్మీ ఫిజియోథెరపిస్ట్ బెక్కం తిరుపతి ఆధ్వర్యంలో పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోష్, వేణు, నాయకులు కిశోర్, రమేశ్, రాజేశం, విజయ్, నాగరాజు పాల్గొన్నారు.

బీమా రంగంలో ఎల్‌ఐసీ వాటా 60శాతం

- డివిజన్ సీనియర్ మేనేజర్ ప్రసాద్‌రావు



మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

జగిత్యాలజోన్: బీమా రంగంలో 60 శాతం మార్కెట్ షేర్ ఎల్ఐసీదేనని కరీంనగర్ ఎల్ఐసీ డివిజన్ సీనియర్ మేనేజర్ ప్రసాద్‌రావు అన్నారు. ఎల్ఐసీ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పట్టణంలో కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, జీవిత బీమా ప్రభుత్వ అగ్రగామి సంస్థ అన్నారు. 20 ఏళ్లుగా అనేక ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలు మార్కెట్‌లోకి వచ్చినా ఎల్ఐసీని అధిగమించలేకపోయాయని చెప్పారు. అనంతరం విశేష సేవలు అందించిన ఉద్యోగులు, ఏజెంట్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎల్ఐసీ సీనియర్ మేనేజర్ బలరామకృష్ణ, ధర్మపురి మేనేజర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్ష

- ఎమ్మెల్సీ కవిత మాస్కులు ధరించి నిరసన


కవితకు ఒడిబియ్యం పోస్తున్న ఉద్యోగులు

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ దీక్ష చేపట్టిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు శుక్రవారం ఎమ్మెల్సీ కవిత మాస్కు ధరించి ఉన్న మహిళకు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరసారె సమర్పించి, ఒడిబియ్యం పోశారు. ఉద్యోగులు అందరూ కవిత ఫేస్ మాస్కులు ధరించి నిరసన తెలిపారు. శ్రావణంలో చివరి శుక్రవారం సందర్భంగా 11వ రోజు దీక్షలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సమాన పనికి సమానవేతనం అమలు చేయాలని, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, ఎస్ఎస్ఏ మహిళా ఉద్యోగులకు సెలవులు వర్తింపచేయాలని, ద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో రూ.1.67లక్షలు మాయం

కథలాపూర్(వేములవాడ): సోషల్ మీడియాలో గృహ రుణం మంజూరు కోసం వచ్చిన కొత్త యాప్‌ను క్లిక్ చేయగా.. ఓ వ్యక్తి రూ.1.67 లక్షలు మోసపోయిన సంఘటన పెగ్గెర్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడి సెల్‌ఫోన్ సోషల్ మీడియాలో గృహ రుణం మంజూరుకు సంబంధించి ఓ యాప్ క్లిక్ చేయాలని సందేశం వచ్చింది. ఆ యువకుడు యాప్‌ను క్లిక్ చేశారు. మొదటగా రూ.1,250 చెల్లించాలని బ్యాంక్ ఖాతా నంబరు పంపించారు. ఆ యువకుడు రూ.1,250 చెల్లించారు. ఇలా రూ.1.67 లక్షలు చెల్లించాక రుణం మంజూరు కాలేదు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

రాఖీ పండుగ లక్కీడ్రా విజేత ఇందూష


విజేతలతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

జగిత్యాల: రాఖీ పౌర్ణమి సందర్భంగా గత నెల 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు ఆ సంస్థ బహుమతులు ప్రకటించింది. కరీంనగర్ రీజియన్‌లో ప్రయాణించిన వారి టికెట్లను ఈనెల 5న కరీంనగర్ రీజినల్ కార్యాలయంలో డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కె.జయశ్రీ, చెంజర్ల కవిత, ఇందూష శుక్రవారం హైదరాబాద్ మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌లో బహుమతులు అందుకున్నారు. సంస్థ సీఎండీ సజ్జనర్ వారిని తొలుత శాలువాలతో సత్కారించారు. ఆతర్వాత నగదు బహుమతులు అందజేశారు. కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) ఎస్.చందర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె.సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనులు షురూ

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ పునరుద్ధరణ పనులను శుక్రవారం ప్రజాప్రతినిధులు, దేవాదాయశాఖ అధికారులు ప్రారంభించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ద్వారా ఇటీవల రూ.33 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులు వెచ్చించి కొత్తగా ఆలయ మండప నిర్మాణం, గోపురం, రాజగోపురం తదితర పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, ఈవో శ్రీనివాస్, దేవాదాయ శాఖ స్థపతి, ఇంజినీర్లతోపాటు, మాజీ జెడ్పీటీసీ ముప్పాల జలజ, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్నసంతోష్, మధుకుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో కొల్వాయి యువతి ప్రతిభ


ప్రశంశపత్రం, నగదు అందుకుంటున్న శిరీష

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఎనగందుల శిరిష జాతీయ విద్యావిధానంపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానం సాధించారు. ఈమేరకు శుక్రవారం గవర్నర్ చేతుల మీదుగా బహుమతి అందుకుతున్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడంలో విద్య పాత్రపై విద్యార్థులు, సామాన్యులకు ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జాతీయ విద్యావిధానం-2020 అమల్లోకి వచ్చి గతనెల 29 నాటికి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ పోటీలు చేపట్టామని రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఇటీవల ఒక ప్రకటన విడుదల చేసారు, ఈ పోటీల్లో కొల్వాయి గ్రామానికి చెందిన ఎనగందుల శిరిష హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచారు. శిరిష ప్రస్తుతం మల్యాల రెవెన్యూ కార్యాలయంలో ఏఎస్‌వోగా పనిచేస్తూ గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సెలవుల్లో ఉన్నారు. శిరిషకు గవర్నర్ రూ.5 వేల నగదుతోపాటు, ప్రశంశపత్రం అందజేశారు. ఆమెను సర్పంచ్ మేసు ఏసుదాసు, సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్ అభినందించారు.

జతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

- భారీ వినాయక విగ్రహం తరలిస్తుండగా తగిలిన విద్యుత్ తీగలు
- మారుతీనగర్ శివారులో ఘటన


విగ్రహానికి తట్టుకున్న విద్యుత్ తీగలు

మెట్‌పల్లిరూరల్: భారీ వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి తెగిపోయిన ఘటన మారుతీనగర్ శివారులో చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా కామారెడ్డికి చెందిన కొందరు యువకులు కోరుట్ల పట్టణంలోని వినాయక విగ్రహ తయారీ కేంద్రం నుంచి భారీ విగ్రహాన్ని ఐచర్ వ్యాన్‌లో శుక్రవారం రాత్రి కామారెడ్డికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మెట్‌పల్లి–కోరుట్ల జాతీయ రహదారిపై మారుతీనగర్ గ్రామానికి కొద్దిదూరంలో విగ్రహానికి విద్యుత్ తీగలు తగిలాయి. మొత్తం మూడు తీగల్లో రెండు తెగిపోగా ,ఒకటి విగ్రహానికి తట్టుకుంది. అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని వెంటనే నిలిపివేశాడు. ఈ సమయంలో యువకులు వాహనం కింద ఉన్నారు. అదృష్టవాశాత్తు ఎలాంటి ప్రమాదం కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ఈ ఘటన జరగడంతో రెండు వైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుక్ను ట్రాన్స్ అధికారులు అక్కడి చేరుకొని తీగలను సరిచేశారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి
- వైద్యులకు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యులు పనిచేయాలని, పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. వైద్య సేవలు, ఇతర విషయాల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతీ ఆదివారం గైనకాలజిస్ట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలపై రికార్డులను పరిశీలించి పూర్తి వివరాలు ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. పలువురు ఉద్యోగులు జీతాలు సరిగ్గా రావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఆయన అధికారులకు ఫోన్‌చేసి జీతాలు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. పేషెంట్లకు కావాల్సిన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రి భవనం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కొత్త భవనం పూర్తయ్యాక సీటీ స్కాన్‌తోపాటు మరిన్ని అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సాజీద్ అహ్మద్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టికెట్ కోసం గోపాల్‌రెడ్డి దరఖాస్తు

కథలాపూర్(వేములవాడ): వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ సిరికొండ గ్రామానికి చెందిన కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి శుక్రవారం అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ నాయకులతో కలిసి హైదరాబాద్‌కు వాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. పార్టీలో రెండు దశాబ్దాలుగా కార్యకర్తగా, నాయకుడిగా మండల, జిల్లాస్థాయిలో సేవలు అందిస్తున్నానని ఆయన తెలిపారు. వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ తరఫున తనకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, జలందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి–కోరుట్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు కథనం ప్రకారం.. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తాండ్రియాల ప్రసాద్(36) శుక్రవారం సాయంత్రం తన స్వగ్రామం నుంచి కోరుట్ల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో మారుతీనగర్ శివారులోని ఎస్సారెస్పీ ఉపకాల్వ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రి.. అక్కడి నుంచి మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు కోళ్ల ఫారం నిర్వహిస్తూ కుటుంబాన్ని సాకుతున్నాడు. మృతుడికి భార్య మానస, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్యాంరాజ్ తెలిపారు.